క్లుప్తంగా

300 మందికి కంటి పొర పరీక్షలు

కేవీపల్లె : మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 300 మందికి కంటి పొర పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు వంగిమళ్ల శ్రీనివాసులురెడ్డి, వంగిమళ్ల నరసారెడ్డి తెలిపారు. మంగళవారం మూడో రోజూ చెన్నై శంకర్‌నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి పొర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల్లో 300 మందికి కంటి పొర పరీక్షలు చేయడం జరిగిందని, పలువురిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. బుధవారం కూడా కంటి పొర పరీక్షలు ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొత్తపు సతీష్‌రెడ్డి, శంకర్‌నేత్రాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలి



నిరసన తెలుపుతున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

పీలేరు : ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలి ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ, జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్ అన్నారు. ఎన్‌ఎస్‌యూఐ జాతీయ శాఖ పిలుపు మేరకు మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పని చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలని డిమాండ్ చేశారు. దళితులు, వెనుకబడిన వర్గాల హక్కులను నిరాకరించడం తోపాటు మహిళల హక్కులకు ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకంగా పని చేస్తోందని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు దేశ అభివృద్ధిపై ప్రభావం చూపుతుందనినారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సాంబ, సాయి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పీలేరురూరల్ : స్థానిక శ్రీ లక్ష్మీ వృద్ధాశ్రమంలో భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బాస్ వ్యవస్థాపకులు పి.టి.ఎం. శివప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాస్ నాయకులు కృష్ణయ్య, నాగరాజ, గంగాధర్, హరినాథ, గురవయ్య, హరి, రవి తదితరులు పాల్గొన్నారు

నేరాల నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ లక్ష్మన్న

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ మండలాల్లో నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని సీఐ లక్ష్మన్న అన్నారు. మంగళవారం ఎస్‌ఐలతో నేరాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరగా పెండింగ్ కేసులు పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులకు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అక్రమ మద్యం రవాణా, జూదాలను అరికట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఐలు లోకేష్‌రెడ్డి, రవికుమార్ ఉన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి అందజేత



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులు

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోట జెడ్పీహైస్కూల్‌లో మంగళవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ సంస్థ ప్రాముఖ్యతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.1000, ద్వితీయ రూ.750, తృతీయ బహుమతి రూ.500 అందించారు. అనంతరం విద్యార్థులకు సంస్థపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రెడ్డిరాద, అన్వర్‌సద్దామ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆలయ కమిటీ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోటలో వెలసిన శ్రీలక్ష్మి ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. రూ.50 వేలు స్థానిక సర్పంచు వై.విజయమ్మ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులైన కృష్ణమూర్తికి మంగళవారం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆర్థిక సహాయంపై గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందించడంతో కమిటీ సభ్యులు, హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు వై. రవిశేఖర్‌రెడ్డి, వైఎస్ సర్పంచ్ మహబూబ్‌బాషా, ఫక్రుద్దీన్, గోపాల్‌రాజు, మహబూబ్‌బాషా, విజయ్‌కుమార్‌రాజు, నారాయణరెడ్డి, జేసీబీ మంజునాథ్ పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



మదనపల్లె సూర్యప్రభ వాహనంపై వెంకన్న



పీలేరు : విశేషాలంకరణలో వెంకటేశ్వరస్వామి



గుర్రంకొండ : శ్రీలక్ష్మీనరసింహస్వామి ఊరేగింపు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు.స్వామి ఉత్సవ విగ్రహాన్ని సూర్యప్రభ వాహనం ఆలయం చుట్టూ ఊరేగించారు. అర్చకులు గోవర్ధన్‌భట్టార్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రథసప్తమి పురస్కంచుకుని భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, ప్రసాద్‌రెడ్డి, ఆలయ సిబ్బంది అంకన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరురూరల్ : పట్టణంలోని కోటపల్లెలో శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ చేపట్టి పూజలు చేపట్టారు. పలువురు భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, రాజేష్, నరసింహారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, అర్చకులు వి.వి. రంగాచార్యులు, వి.వి. గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తరిగొండ గ్రామంలో..

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రథసప్తమి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ఆలయంలో ఉదయాన్నే స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం స్వామివార్లను అందంగా అలంకరించిన గ్రామోత్సవ పల్లకీలో కొలవుదీర్చి మేళతాళాలతో గ్రామపురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పండుగ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివార్లకు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

పులికల్లులో ..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లులో మంగళవారం శ్రీ మదనంత నాగేశ్వర స్వామి రథసప్తమి వేడుకలు కనుల పండుగగా నిర్వహించారు. 11 ఏళ్ల తరువాత యువకులు, గ్రామస్థులు మూకుమ్మడిగా దైవ కార్యం చేసేందుకు ముందుకు వచ్చి సహకరించారని ఆలయ ధర్మకర్త రాజగోపాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో గత ఐదు రోజులుగా గ్రామంలో ఏనుగు వాహనం, హనుమంత వాహనం, శేష వాహనం, అశ్వ వాహనం లాంటి కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ తరుణంలో షష్టి రథ సప్తమి సందర్భం వేద పండితుల మంత్రోచ్చారణలు, గోవిందనామ స్మరణలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. స్థానికులే గాక చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు తరలి వచ్చి పూజల అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు భోజన సదుపాయం సమకూర్చారు.

భక్తి శ్రద్ధలతో రథ సప్తమి పూజలు

కలకడ : రథసప్తమి పురస్కరించుకుని మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం శ్రీసాయి మందిరం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి నాగయ్యస్వామి ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మదనపల్లె : రథసప్తమి సందర్భంగా మంగళవారం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారిని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాత సేవలో, టీడీపీ నాయకులు మార్వారి వరుణ్ కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మెల్యే దర్శనం చేసుకున్నారు. ప్రజలకు రథసప్తమి శుభాకాంక్షలు తెలిపారు.

దారి సమస్యపై అధికారుల విచారణ



దారి సమస్యపై గ్రామస్తులతో చర్చిస్తున్న అధికారులు

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ పంచాయతీ సుంకరవాండ్లపల్లెలో నెలకొన్న దారి సమస్యపై అధికారులు విచారణ జరిపారు. గ్రామానికి సమీపంలోని పొలాలకు అవతలివైపు పురాతన ఆంజినేయస్వామి ఆలయం ఉంది. ఆలయంతో పాటు ఎంతో మంది రైతుల పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఈనేపథ్యంలో గత సోమవారం గ్రామస్తులు దారి సమస్య పరిష్కరించాలంటూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ మధురామచంద్రుడు మంగళవారం గ్రామానికి చేరుకొన్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేసిన దారిని, పొలాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులందరితో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గ్రామానికి సమీపంలో ఉన్న రైతులు తమది రైత్వారీపట్టాలున్న పొలాలని, తమ పెద్దల కాలం నుంచి అవతలివైపు పొలాలకు మూడు అడుగుల మేరకే నడక దారి ఉందన్నారు. ఇప్పుడు ఎక్కువ స్థలం ఇస్తే తాము నష్టపోతామని పేర్కొన్నారు. గతంలో లాగా మూడు అడుగుల స్థలంలో వెళ్లడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. అలాగే పురాతన ఆంజినేయస్వామి ఆలయంకు వెళ్లడానికి సరైన మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని కొంతమంది గ్రామస్తులు పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న మేరకు కాకుండా అదనంగా మరో మూడు అడుగులు దారికి కేటాయిస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరారు. రైత్వారీపట్టాలు కలిగిన రైతులు గ్రామస్తుల సమస్యను అర్థం చేసుకొని మరో మూడు అడుగుల మేరకు దారి కోసం స్థలం కేటాయించాలని అధికారులు సూచించారు. రెండు రోజులు గడువుతీసుకొని సమస్య పరిష్కారానికి అందరూ సహకరించాలని అధికారులు కోరారు.

పెచ్చుమీరుతున్న కూటమి ప్రభుత్వ అరాచకాలు

పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



చింతపర్తి మేకలవారిపల్లిలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి (వాల్మీకిపురం) : కూటమి ప్రభుత్వ అరాచకాలు నానాటికీ పెచ్చుమీరుతున్నాయని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం పట్టణం, చింతపర్తి గ్రామాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన స్థానికంగా కార్యకర్తలను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి నేతల దౌర్జన్యాలు, దాడులు చూస్తుంటే రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా అన్న అనుమానం కలుగుతోందన్నారు. అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా పింఛన్లు తప్ప ఇతర ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలు అమలు చేయలేమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

రథసప్తమి పూజలు:

పట్టణ పరధిలోని 13వ శతాబ్దం నాటి పురాతన శ్రీ పట్టాభి రామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో జరిగిన రథసప్తమి పర్వదిన పూజలలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ : పట్టణంలోని కొత్తపేటవీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బిడ్డల శ్రీనివాసులు రెడ్డి భార్య అనిత(46) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల వారి ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాల్మీకి కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ నల్లంకి నరసింహులు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుండగా వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాలలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నీళ్ల భాస్కర్, వాల్మీకిపురం వైస్ సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, నాయకులు ఆనంద, రఘు, భాస్కర, విశ్వనాథ్, లక్ష్మీనారాయణరెడ్డి, చెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి బలం

- 8నెలలకే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- భవిష్యత్తు వైఎస్సార్ సీపీదే
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్




మాట్లాడుతున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్

నిమ్మనపల్లె : నియోజకవర్గంలో గ్రామగ్రామాన వైఎస్సార్ సీపీ కోసం ప్రాణాలిచ్చే కార్యకర్తలు ఉన్నారని, వారే పార్టీకి కొండంత బలమని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. మండలంలోని ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లెలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమన్వయకర్త నిసార్‌అహ్మద్ హాజరై.. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కూటమిప్రభుత్వం 8నెలల పాలనలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల భవితను మార్చేస్తామని ఊదరగొట్టిన చంద్రబాబు...నీతిఆయోగ్‌పై మాట్లాడుతూ రాష్ట్ర ఖజానా దివాలా తీసిందని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడం కుదరదని మాట్లాడారన్నారు. ఎన్నికలకు ముందు పేదలను కుబేరులు చేస్తానని మభ్య పెట్టిన చంద్రబాబును, ఎవరైనా సూపర్‌సిక్స్ వాగ్దానాలపై ప్రశ్నిస్తే వారిపై అధికారాన్ని వినియోగించుకుని కేసులు నమోదు చేస్తున్నారన్నారు. చివరికి సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు నమోదుచేసి తమ నిరంకుశత్వాన్ని చాటుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, కష్టనష్టాల్లో పార్టీ అందరికీ అండగా ఉంటుందన్నారు. కూటమిప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి, జగన్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే, ఇప్పటికే ఆ కుటుంబాలకు అందే సంక్షేమ పథకాలు, జరిగే మంచిని వివరించాలన్నారు. ప్రజానాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, ప్రస్తుత కూటమిప్రభుత్వం అసమర్థ పాలనకు తేడాను వివరించాలన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచే ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమణారెడ్డి, రెడ్డిశేఖర్ రెడ్డి, నూర్‌మొహిద్దీన్‌ఖాన్, సర్పంచ్ చెంద్రాయుడు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, నారాయణ, రాజగోపాల్, కొండగాళ్లరమణ, కొత్తపల్లె మహేష్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె తహసీల్దార్‌గా ధనంజయులు

మదనపల్లె : మండల రెవెన్యూ అధికారి(తహసీల్దార్)గా డెప్యుటేషన్ ప్రాతిపదికన నిమ్మనపల్లె తహసీల్దార్ ధనంజయులు నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి నిమ్మనపల్లె, మదనపల్లె తహసీల్దార్‌లు ధనంజయులు, ఖాజాబీలను పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మదనపల్లెలో పనిచేస్తున్న తహసీల్దార్ ఖాజాబీని, నిమ్మనపల్లెకు, అక్కడ పనిచేస్తున్న ధనంజయులును మదనపల్లెకు బదిలీ చేశారు. ఉత్తర్వులు వెలువడిన తక్షణమే ఇద్దరు తహసీల్దార్‌లు వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని, దీనిపై ఎటువంటి అభ్యర్థనలు, విజ్ఞప్తులు పరిగణనలోకి తీసుకోవడం జరగదన్నారు.

స్టెమీతో ఉచిత గుండె వైద్య సేవలు



బి.కొత్తకోట: మాట్లాడుతున్న ఎంఓ కిరణ్‌కుమార్

బి.కొత్తకోట : స్టెమీ కార్యక్రమం ద్వారా పేదలకు ఉచితంగా గుండె వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తుందని స్థానిక సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం సీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్య వచ్చిన గంటలోగా బాధితులను ఆస్పత్రికి తీసుకువస్తే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రులకు తరలించడం జరుగుతుందన్నారు. ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం గుండెపోటు లక్షణాలని అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా గైనకాలజిస్టు హసీనా బేగం మహిళల్లో వచ్చే కేన్సర్ గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



తాగునీటి కొళాయిలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దమండ్యం : మండలంలోని శిద్దవరం కస్తూర్బా గాంధి బాలికల గురుకుల విద్యాలయాన్ని మంగళవారం రాష్ట్ర కేజీబీవీల డిప్యూటీ డైరక్టర్ దేవరాజ్, జీసీడీవో మధుమతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, కూరగాయలను వారు పరిశీలించారు. భోజనం తింటున్న విద్యార్థులతో మట్లాడారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన నీటి కొళాయిలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో విడిగా మాట్లాడారు. అలాగే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు పురుగులు ఉన్న అన్నం... నీళ్ల సాంబారు.. విద్యార్థులు బాతురూంలు శుభ్రం చేయిస్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయిన విషయం తెలిసిందే. సామాజిక మాధ్యమాలలో ఫొటోలు వైరల్ కావడంతో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం కేజీబీవీ ఎస్ఓకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈ క్రమంలో ఇద్దరు ఎంఈవోలు, ఇద్దరు హెచ్‌ఎంలు, ఓ ఉపాధ్యాయురాలు విద్యార్థులను విచారించి డీఈఓకు నివేదించారు. మంగళవారం డిప్యూటీ డైరెక్టర్, జీసీడీఓలు తనిఖీ చేయడం, విద్యార్థులను విచారించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి ఆంజినేయులు, ఎస్‌వో రాణికుమారి పాల్గొన్నారు.

వివాదాస్పద పొలాల్లో

పనులు చేస్తే బిల్లులు ఇవ్వం

వాటర్‌షెడ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ



దాసరి వంక వద్ద పనులను తనిఖీ చేస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం : వాటర్‌షెడ్ ద్వారా పనులు చేపట్టే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించి పనులు ప్రారంభించండి. వివాదాస్పద పొలాల్లో పనులు చేపడితే బిల్లులు ఇవ్వమని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ స్పష్టం చేశారు. మంగళవారం పీడీ లక్ష్మీ నరసయ్య ప్రోగ్రాం, టెక్నికల్ అధికారులతో కలసి మండలంలోని సంపతికోట పంచాయతి పరిధిలో వాటర్‌షెడ్ ద్వారా పూర్తి చేసిన, చేపడుతున్న పనులను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ విలేకరులతో మాట్లాడుతూ వాటర్‌షెడ్‌లో ఐదేళ్ళ కాల పరిమితిలో జరిగే పనులకు జిల్లా వ్యాప్తంగా రూ.55 కోట్ల నిధులు మంజూరు కాగా గడచిన రెండేళ్ళ కాల వ్యవధిలో రూ.17 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఊటకుంటలు, మినీ ఊటకుంటలు, ర్యాక్ పిల్స్, పశువుల షెడ్ల పనులు పూర్తి చేశామన్నారు.

పంచాయతీ ఉద్యోగులు లేని పోస్టులకు అప్‌గ్రేడ్

- 12 మందికి అవకాశం ఇస్తూ జీవో జారీ
- జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను భర్తీ చేయాలి

బి.కొత్తకోట : బి.కొత్తకోట నగర పంచాయతీలో 12 పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసింది. అయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గ్రామపంచాయతీ ఉద్యోగులు లేకపోవడంతో ఉపయోగం లేకుండాపోయింది. 2019 డిసెంబర్‌లో గ్రామపంచాయతీగా ఉన్న బి.కొత్తకోటను నగర పంచాయతీగా మార్చుతూ ఉత్తర్వు జారీ అయ్యింది. అయితే పంచాయతీలో పనిచేస్తున్న ఉద్యోగులంతా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టుకు చెందిన వారే. వీరిలో బిల్ కలెక్టర్, మరో ఏడుగురిపై పంచాయతీ నిధుల స్వాహా ఆరోపణలు రావడంతో 2021లో అప్పటి కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వతంగా తొలగిస్తూ, బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో వీరంతా ఉద్యోగాలు కోల్పోయారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి కూడా అప్పటికే బదిలీ అయ్యారు. దీనితో పంచాయతీ కార్యదర్శి సహా, మిగిలిన ఉద్యోగులకు నగర పంచాయతీలో వివిధ స్థాయిలో ఉద్యోగాలు చేసే అవకాశం కోల్పోయారు. ప్రస్తుతం మంజూరైన 12 పోస్టులకు సంబంధించి జూనియర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ కావాల్సివుంది.

అవగాహనతో కేన్సర్ నివారణ



కేవీపల్లె : గర్నిమిట్టలో అవగాహన ర్యాలీ



పీలేరు : తలపులలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

కేవీపల్లె : సరైన అవగాహనతో కేన్సర్‌ను నివారించవచ్చునని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేష్మ అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని గర్నిమిట్టలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా ప్రతి రోజూ సంపూర్ణమైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయటం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించం ద్వారా కేన్సర్‌ను నివారించవచ్చునని తెలిపారు. ప్రమాదకారకాలైన ధూమపానం, మద్యపానం, గుట్కా, పాన్, తంబాకు, ఖైనీ లాంటి వాటికి, అసురక్షితమైన లైంగికవిధానాలకు, బహుళ లైంగిక సంబంధాలకు దూరంగా ఉండటం ముఖ్యమన్నారు. సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, పీహెచ్‌ఎన రమాదేవి, సూపర్‌వైజర్లు రుక్మిణి, పురుషోత్తం పాల్గొన్నారు.

అవగాహనతోనే కేన్సర్ నివారణ సాధ్యం

మదనపల్లె : కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్.కోటేశ్వరి, డాక్టర్.సౌమ్యపల్లవి అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ఆస్పత్రిలో కేన్సర్‌పై అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా సమాజంలో కేన్సర్ వ్యాధి తీవ్ర రూపం దాలుస్తోందన్నారు. ప్రజల నిత్యజీవన విధానంలో ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం , మెరుగైన ఆరోగ్య అలవాట్లను పెంపొందించుకోవడం వల్ల కేన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. నిరంతర వ్యాయామం, చక్కని ఆరోగ్య అలవాట్లను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ మన్సూర్ అహ్మద్, డాక్టర్.రమేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్.మంజుల పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలతో కేన్సర్ మహమ్మారికి అడ్డుకట్ట

పీలేరు : ముందస్తు ఆరోగ్య పరీక్షలతో కేన్సర్ మహమ్మారికి అడ్డుకట్ట వేయవచ్చునని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తలపులలో ప్రపంచ కేన్సర్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంలో సాధారణ ఆరోగ్య సమస్యలు దీర్ఘకాలంగా బాధిస్తుంటే వ్యాధుల నిర్ధారణ చేసుకుని నివారణ చర్యలు పొందాలన్నారు. పొగాకు ఉత్పత్తులు నమలడం, తినడం, పీల్చడం వంటివి చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మర్రికుంటపల్లిలో మహాభారత యజ్ఞం

కలికిరి : మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ పరిధిలోని మేడికుర్తి క్రాస్‌లో ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పదహారు రోజుల పాటు మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ, రేడియో, టీవీ ఆర్టిస్ట్ జ్యోత్స్న ఆధ్వర్యంలో ప్రతి రోజూ మధ్యాహ్నం నుంచి హరికథా కాలక్షేపం, శ్రీ వెంకటేశ్వర నాటక కళామండలి ఆధ్వర్యంలో ప్రతి రోజూ రాత్రి 9 గంటల నుంచి నాటక ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా వెంకన్న ఆలయ బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణ దృశ్యం

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం టీటీడీ ఆగమసలహాదారు శ్రీనివాసచార్యులు అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, క్రిష్ణమూర్తి, ధనుష్,టీటీడీ వేద పండితులు లక్ష్మణ, బాలాజీ సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవాన్ని భక్తులకు కనువిందుగొల్పే విధంగా నిర్వహించారు. టీటీడీ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో హరికథ, కళాకారులు నిర్వహించిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ దుషంత్‌కుమార్, ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.